# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖపట్నం సముద్ర జలాల్లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (IFR) - 2026 ఈరోజు అట్టహాసంగా జరిగింది.
- ❖ భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 15వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది.
- ❖ అహ్మదాబాద్ వేదికగా భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య రాత్రి 7 గంటలకు టీ-20 క్రికెట్ మ్యాచ్ జరగనుంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22న ప్రసారమవుతుంది.

=======================

విశాఖపట్నం సముద్ర జలాల్లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (IFR) 2026 ఈరోజు అట్టహాసంగా జరిగింది. త్రివిధ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై ఈ నౌకాదళ సమీక్షలో పాల్గొన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నావికాదళానికి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీకి చెందిన 7 పరిశోధన నౌకలు ఫ్లీట్ రివ్యూలో పాల్గొని తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు నావల్ డాక్ యార్డ్ నుంచి బయలుదేరి సముద్ర జలాల్లోకి ప్రయాణించారు. మొత్తం ఆరు వరుసల్లో నిర్వహించిన 71 యుద్ధ నౌకలు పరేడ్ ను రాష్ట్రపతితో కలిసి వారు తిలకించారు. ఫ్లీట్ రివ్యూ వీక్షించిన అనంతరం రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ నౌకాదళ విన్యాసం భారత నావికాదళ శక్తి, సాంకేతిక నైపుణ్యం, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. యువతకు, ముఖ్యంగా

విశాఖపట్నం వంటి తీరప్రాంతాల్లోని విద్యార్థులకు భారత నౌకాదళం స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

======================

భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోందనడానికి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐ.ఎఫ్.ఆర్.) నిదర్శనమని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో INS సుమేధా నౌకపై ప్రయాణిస్తూ రాష్ట్రపతితో పాటుగా భారత నౌకాదళం, మిత్ర దేశాల నౌకాదళాలకు చెందిన 72 ఆధునిక యుద్ధ నౌకలు, సబ్‌మరైన్లను ఆయన వీక్షించారు. “యునైటెడ్ త్రూ ఆడియన్స్” అనే ఇతివృత్తంతో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ పెరుగుతున్న భారత సముద్ర శక్తి సామర్థ్యాలను, ప్రపంచ దేశాలతో బలపడుతున్న భాగస్వామ్యాలను ప్రతిబింబించిందని రామ్మోహన్ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. స్వదేశీ విమాన వాహక నౌక INS విక్రాంత్ కూడా ఈ ఫ్లీట్ రివ్యూలో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఈ నౌక రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రతీకగా నిలిచిందన్నారు.

======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 15వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం అమరావతిలో ఈరోజు జరిగింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), విద్యుత్, పర్యాటకం, ఆహార శుద్ధిరంగం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాలకు చెందిన వివిధ పెట్టుబడి ప్రతిపాదనలకు ఈ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం లభించింది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీ.ఎస్. కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

విరామం

======================

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 6వ రోజైన ఈరోజు పలు ప్రధానాంశాలు చర్చకు వచ్చాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కీలక బిల్లులను కూడా ప్రవేశపెట్టారు. భవన నిర్మాణదారులకు ఊరట కలిగించేలా నిర్మాణాల సమయంలో ఉన్న ఖాళీ స్థలంపై వేసే పన్నును 50 శాతం తగ్గించేందుకు సంబంధించిన బిల్లును మంత్రి పి.నారాయణ శాసన సభలో ప్రవేశపెట్టారు. భవన నిర్మాణం చేపట్టినప్పటి నుండి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే వరకు ఇది వర్తిస్తుందని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున.. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ “ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు -2026”ను సభలో ప్రవేశపెట్టారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఏడాదిలో 4 సార్లు ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించేందుకు ఈ బిల్లును తీసుకువచ్చామని మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

సభ్యులందరి ఆమోదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు - 2026 ఆమోదం పొందినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రకటించారు. అనంతరం ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఇటీవల ప్రవేశపెట్టిన 2026 - 27 వార్షిక బడ్జెట్ పై పలువురు సభ్యులు ప్రసంగించారు. ఆ తరువాత స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసన సభను రేపటికి వాయిదా వేశారు

========================

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మొదటి విడతగా 6 గ్రామాలను ఎంపిక చేసి మోడల్ సౌర గ్రామాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి నెల్లూరులో సమీక్షా సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 6 గ్రామాలలో ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల ఇతర గ్రామాల ప్రజలకు కూడా అవగాహన కలుగుతుందన్నారు. 5 వేల మందికి పైగా జనాభా కలిగిన గ్రామాలను మోడల్ సౌర గ్రామాలుగా పరిగణనలోకి తీసుకుంటారన్నారని చెప్పారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి సౌర ఆధారిత హోం లైటింగ్ సిస్టమ్‌లు, సౌర నీటి సరఫరా వ్యవస్థలు, వ్యవసాయ అవసరాలకు సౌర పంపులు, సౌర వీధి దీపాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ఈ పథకం ద్వారా చేపడతామని చెప్పారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కలెక్టర్  కోరారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య రాత్రి 7 గంటలకు మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే తొలి మూడు మ్యాచ్ లలో విజయం సాధించిన భారత్ సూపర్-8కు అర్హత సాధించింది. ఇక శ్రీలంకలోని కొలంబో వేదికగా నమీబియా, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లకు 3 వికెట్ల కోల్పోయి 199 పరుగులు చేసింది. లక్ష్య ఛేదన ప్రారంభించిన నమీబియా 15 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అంతకుముందు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో అమెరికాపై దక్షిణాఫ్రికా జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

========================

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈరోజు ఆయన అధ్యక్షతన పరీక్షల నిర్వహణపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు మార్గదర్శకాలను జారీ చేశారు.

========================
========================